క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈఈ మధుకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తంగళ్లపల్లి, మండెపల్లి, తాడూర్, రామన్నపల్లి, బస్వాపూర్, బాలమల్లుపల్లె గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో కరెంట్ తీగల కింద ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని సెస్ ఏఈఈ పృథ్వీధర్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. బండలింగంపల్లి, నారాయణపూర్, అక్కపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఉండదన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు


మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ సర్కారు పెడుతున్న అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్లో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై దాడి చేయడం సరికాదన్నారు. మట్టె శ్రీనివాస్, అనిల్, శ్రీకాంత్ గాజుల, మహేశ్, ముజ్జు రాకేశ్, శ్రీనివాసరావు, నరేశ్, వెంకటేశ్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయాలి

ముస్తాబాద్: వరంగల్‌లో ఈనెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు కోరారు. 14 ఏళ్లు తెలంగాణ కోసం కొట్లాడి స్వరాష్ట్రం సాధించిన బీఆర్ఎస్‌కు పదేళ్లు అధికారాన్ని అప్పగించారన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చలో వరంగల్ పోస్టర్‌ను మండల నాయకులు ఆవిష్కరించారు. జిల్లాపరిషత్ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు మాట్లాడారు. పల్లె నర్సింహారెడ్డి, మల్లుగారి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



బోయినపల్లి: కొదురుపాక బీసీఎం ట్రస్ట్ ఐ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు డాక్టర్ వైర్యాగ్యం రాజలింగం రీటాబహదూర్ దంపతుల ఆధ్వర్యంలో కొదురుపాక ఎక్స్ రోడ్డులో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

చెక్కులు అందజేత

గంభీరావుపేట: మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, నాయకులు అక్కపల్లి బాలయ్య, మల్లయ్య, జంగం రాజు, నాంపల్లి, గౌరీశంకర్, రాజశేఖర్, ఏఎంసీ డైరెక్టర్ కోట లింగం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: వేములవాడలోని తెలంగాణ మైనారిటీ గురుకులంలో 5వతరగతి నుంచి 8వతరగతి వరకు ఖాళీ సీట్ల ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులను ఈనెల 30 వరకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంఎల్టీ, డీఎంఎల్టీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

వేములవాడఅర్బన్: పదోతరగతి పాసైన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సులు చదివేందుకు పాలిసెట్ 2025 ప్రవేశపరీక్ష దరఖాస్తుకు ఈనెల 19 చివరి తేదీ అని వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వర స్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 ఆలస్య రుసుముతో ఈనెల 21, రూ.300 తత్కాల్ రుసుముతో ఈనెల 23 చివరి తేదీ ఉందన్నారు. అగ్రహారం ఎస్సారార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులు సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

సిరిసిల్ల: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) హైదరాబాద్‌లో డిప్లొమా ఇన్ హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సుల్లో మూడేళ్ల ప్రవేశాలకు ఉచిత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ అధికారులు తెలిపారు. ఇంగ్లిష్ సబ్జెక్టుతో కూడిన పదోతరగతి విద్యార్హతతో 25 ఏళ్ల లోపు యువతీయువకులు ఐఐహెచ్‌టీలో చేరొచ్చని వివరించారు. ఆసక్తి ఉన్నవారు మే 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.


అనంతారం చర్చిలో..


వీర్నపల్లి చర్చిలో..

గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

ఇల్లంతకుంట: అనంతారం, గాలిపెల్లి, ఇల్లంతకుంట, పొత్తూరు, నర్సక్కపేట తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు చేశారు.

వీర్నపల్లి: మండల కేంద్రంతోపాటు అడవిపదిర, రంగంపేట గ్రామాల్లో గ్లోరియస్ గాస్పెల్ చర్చి, కంచర్ల, వన్‌పల్లి, గర్జనపల్లి మద్దిమల్ల గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు కిశోర్, ఏసుదాస్, రాజేశ్, అబ్రహాం, క్రీస్తుదాసు, ప్రేమ్‌కుమార్, గిద్యోను, మధుబాబు పాల్గొన్నారు.


అల్మాస్‌పూర్ చర్చిలో..

చిన్న సంచుల సరఫరా.. ఆందోళనలో అన్నదాతలు

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఇందిరాక్రాంతి పథకం కింద మహిళలు నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు చిన్నగా వచ్చాయని నిర్వాహకులు, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కనీసం 42 కిలోల తూకం వేసేలా కేంద్రాల్లో గన్నీ సంచులు సమకూర్చాలని మండల రైతులు కలెక్టర్‌ను శుక్రవారం కోరారు. ప్రతి ఏడాది కేంద్రాలకు 42 కిలోల వడ్లు తూకం వేయడానికి గన్నీ సంచులను ప్రభుత్వం సమకూర్చుతుంది. గత సీజన్‌లో కొత్త, పాత సంచులు కలిపి 42 కిలోలు తూకం వేయడానికి కేంద్రాలకు సంచులను సరఫరా చేసేవారు. ఈసారి కొత్తగా పంపిన సంచుల్లో ధాన్యం తూకం వేస్తే 37కిలోల700గ్రాములు మాత్రమే పడుతున్నాయి. ఈ సీజన్‌లో సివిల్ సప్లయ్ శాఖ అధికారులు 37కిలోల700గ్రాముల ధాన్యం పట్టే సంచులు సరఫరా చేశారని నిర్వాహకులు అంటున్నారు.


ఎల్లారెడ్డిపేట కొనుగోలు కేంద్రంలో 37 కిలోలు చూపిస్తున్న గన్నీ సంచి

ఊపందుకున్న వరి కోతలు


ఇల్లంతకుంటలో వరి కోస్తున్న హార్వెస్టర్

ఇల్లంతకుంట: మండలంలో యాసంగి సీజన్లో వేసిన వరి పంట పొలాల కోత ఊపందుకుంది. మండలంలో ముఖ్యంగా వరి పంట ఎక్కువగా సాగు చేస్తుంటారు రైతులు. యాసంగి సీజన్లో మండలంలో 21,150 ఎకరాల వరకు వరి సాగు చేసినట్టు వ్యవసాయ అధికారి సురేశ్‌రెడ్డి తెలిపారు. మెట్ట ప్రాంతమైన మండలంలో బోరు బావుల్లో నీటి లభ్యత ఉన్న రైతులు వరి సాగు చేస్తుంటారు. వరి పంట కోతకు రావడంతో పంట పొలాలు కోయడంలో రైతులు తలమునకలై ఉన్నారు. ఇప్పటికే వరి కోసిన రైతులు తమ ధాన్యాన్ని వడ్ల కొనుగోలు కేంద్రాలకు తరలించారు. మిగిలిన రైతులు తమ పంట పొలాలను కోయడంలో నిమగ్నమై ఉన్నారు. అడపాదడపా వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు తమ పొలాలను త్వరగా కోసేందుకు తాపత్రయపడుతున్నారు. కోత మిషన్ కోసం వరుస కడుతున్నారు. మండలంలో దాదాపు సగానికి పైగా వరి కోతలు జరిగాయి.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నరు


రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి: నిమ్న కులాలు, పేదలు, వెనకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించేందుకు ఆమోదించిన రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి రాజ్యాంగ హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రుద్రంగి ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి ఆరోపించారు. శుక్రవారం మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో నాయకులతో కలిసి పాల్గొని మాట్లాడారు. గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు గడ్డ శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, కట్కూరి దాస్, ఇప్ప మహేశ్, పల్లి గంగాధర్, శ్రీనివాస్, జక్కు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాజ్యాంగ పరిరక్షణను అందరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బండలింగంపల్లి, సింగారం, కోరుట్లపేట గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విజయ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బుచ్చాగౌడ్, సత్యనారాయణ, జంగ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం దినచర్యలో భాగం కావాలి


జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న వైద్యులు, టీచర్లు, పుర ప్రముఖులతో డాక్టర్ నాగమల్ల శ్రీనివాస్

వేములవాడ: వ్యాయామం దినచర్యలో భాగం కావాలని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగమల్ల శ్రీనివాస్ అన్నారు. జాతీయ వ్యాయామ దినోత్సవం సందర్భంగా బైపాస్ రోడ్డులోని జిమ్‌లో స్థానిక వైద్యులు, ఉపాధ్యాయులు, యువకులు, పుర ప్రముఖులతో కలసి శుక్రవారం వేడుక జరుపుకున్నారు. ఐఎంఏ జిల్లా మాజీ అధ్యక్షురాలు పద్మలత మాట్లాడుతూ.. ఇంటికి దీపం ఇల్లాలంటారు కాబట్టి ఇల్లాలి ఆరోగ్యం ఎంతో అవసరమని, మహిళలు, గర్భిణులు, వయస్సు పైబడినవారు సైతం వ్యాయామం చేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకుడు మాడిశెట్టి మహేశ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వయస్సుతో నిమిత్తం లేకుండా క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఐఎంఏ ఉపాధ్యక్షుడు చీకోటి సంతోష్, వైద్యులు ఆనందరెడ్డి, సంతోష్, అనిత, దీప్తి, వర్ష, నామాల ప్రదీప్, రాజేందర్, ప్రవీణ్, ఉపాధ్యాయులు దూస సంతోష్, జనపాల వెంకటయ్య, రాజశేఖర్‌రెడ్డి, జిమ్ నిర్వాహకుడు శబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సంకీర్తన సంప్రదాయమే సనాతన ధర్మానికి ఊపిరి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతాప రామకృష్ణ తదితరులు

వేములవాడ: సంకీర్తన సంప్రదాయమే సనాతన ధర్మానికి ఊపిరిగా నిలుస్తుందని అనువంశిక అర్చక ట్రస్టు అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. మే 7న హైదరాబాద్‌లో జరిగే హైందవ భక్తి సమ్మేళనం పోస్టర్‌ను అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. విజయశంకర స్వామి వేములవాడ రాజన్న ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. తిరుపతి తరహాలో యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో నిత్య అఖండ హరినామ సంకీర్తన జరగాలని సూచించారు. హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ అధికార ప్రతినిధి(హెచ్‌పీఈ) మల్లికావల్లభ, కలం-కాగితం సంస్థ వ్యవస్థాపకుడు రంగనాయకుల సంతోష్‌బాబు, జైభారత్ రాష్ట్ర కార్యదర్శి ఖదిజ్ఞాసి రాజు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న కేకే

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శుక్రవారం మండల కేంద్రంలోని గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవం నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రవీణ్ జే టోని, సత్తు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప జాతర ఉత్సవాలు


హాజరైన చల్మెడ లక్ష్మీనర్సింహారావు తదితరులు

కోనరావుపేట: నిమ్మపల్లిలో బీరప్ప జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గ్రామ శివారులోని గొల్లపల్లిలో ఈనెల 10 నుంచి కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం గారడి వేషాలు, దిష్టికుంభం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దేవరకొండ తిరుపతి, బండ నర్సయ్య తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కోనరావుపేట: వెంకట్రావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గోవిందారం గ్రామానికి చెందిన మాధవిశర్మ కుమార్తెలు పూర్ణిమ, లక్ష్మి, శ్వేత 25 గ్రాముల వెండి, రూ.22,116 విరాళంగా అందజేశారు. గ్రామానికి వచ్చిన సందర్భంగా వారి తండ్రి వెల్మకన్నె లక్ష్మణశర్మ జ్ఞాపకార్థం గ్రామ మాజీ సర్పంచ్ మంతెన సంతోష్‌కు అందజేశారు.

ఎల్లమ్మ గుడికి విద్యుత్ సౌకర్యం

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ గుడికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ఎంపీ నిధులతో 24 గంటల విద్యుత్ సౌకర్యం సెస్ సిబ్బంది శుక్రవారం ఏర్పాటు చేశారు. రూ.3.80లక్షల నిధులు బండి సంజయ్ మంజూరు చేయగా.. ఇల్లంతకుంట సెస్ సిబ్బంది విద్యుత్ స్తంభాలు ఇల్లంతకుంట అర్బన్ ఫీడర్ నుంచి లైన్ కలుపుతూ సింగిల్ ఫేస్ డిస్ట్రిబ్యూటర్ ట్రాన్స్‌ఫార్మర్ 25 కేవీ పనులు పూర్తి చేసి ఆలయానికి 24 గంటల విద్యుత్ సౌకర్యం కల్పించారు. సెస్ ఏఈ నగేశ్‌కుమార్, లైన్‌మెన్ అక్కెం ఎల్లయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య, ఉపాధ్యక్షుడు అంతటి రమేశ్, కొయ్యడ భాస్కర్‌గౌడ్, ముంజ భాస్కర్‌గౌడ్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థుల నృత్యం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పట్టణంలోని నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి దూస రఘుపతి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతోపాటు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తూ ఉపాధ్యాయులు పని చేయడం అభినందనీయమన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం మోతిలాల్, ప్రధానోపాధ్యాయులు గణేశ్, నాగుల భాగ్యరేఖ, ఆరో వార్డు మాజీ కౌన్సిలర్లు గుండ్లపెల్లి రామానుజమ్, ఎర్రం వెంకటరాజం తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, స్కిట్లు, పాటలు, ఉపన్యాసాలు అలరించాయి.

వీర్నపల్లి: గర్జనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నార్కోటిక్స్ ఎస్పీ భూక్య రాంరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యం చేరాలంటే చదువుపై దృష్టి పెట్టాలన్నారు. మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈఈ రాములునాయక్, మాజీ సర్పంచ్ రవి, శ్రీనివాస్, రాకేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు డాక్టరేట్

వేములవాడరూరల్: ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తూ.. దొరికిన సమయంలో యువతకు క్రీడల్లో శిక్షణ ఇస్తూ.. ఆపద సమయంలో రక్తదానాలు చేస్తూ ప్రజాసేవ చేస్తున్న ఓ ఉద్యోగిని గుర్తించి డాక్టరేట్ పట్టా అందజేశారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో గొడిశెల రాజశేఖర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ 8 సంవత్సరాలుగా యువ ఫౌండేషన్ పేరుతో పలువురు యువకులకు శిక్షణ అందిస్తున్నారు. ఆయన వద్ద శిక్షణ పొందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. రక్తదానాలు చేస్తూ కరోనా సమయంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ–న్యూఢిల్లీ, ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్ ఆర్గనైజేషన్ అమెరికా ద్వారా శుక్రవారం హైదరాబాద్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో డాక్టరేట్ పొందినట్లు ఆయన తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: నిరుద్యోగ యువకుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువశక్తి పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి జగన్మోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. బండలింగంపల్లిలో శుక్రవారం మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం నిరుపేదల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, నాయకులు గౌస్, బుచ్చాగౌడ్, బాలయ్య, ఎల్లాగౌడ్, జంగ అంజిరెడ్డి, దేవయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వీర్నపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న మలుపులతో నిత్యం వాహనాదారులు హడలెత్తిపోతున్నారు. ఈ ప్రమాదకర మలుపుల వద్ద డబుల్ సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయపోవడం, వేగ నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరిగితే గాని పట్టించుకోరా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనదారులు అటు ఇటు వెళ్లే క్రమంలో మలుపుల వద్ద అతివేగంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఎక్కడ ఢీకొట్టుకుంటామోనని భయాందోళనల మధ్య రాకపోకలు సాగిస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

నల్ల బ్యాడ్జీలతో నిరసన


బొప్పాపూర్‌లో నిరసన తెలుపుతున్న ముస్లింలు

ఎల్లారెడ్డిపేట: వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాచర్లబొప్పాపూర్‌లో శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సాహెబ్, గ్రామ అధ్యక్షుడు ఇర్ఫాన్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మహ్మద్ ఇర్ఫాన్, ఖలీద్, వహీద్, వాజిద్, షాకీర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు బిల్లును వెంటనే ఉపసంహరించుకొని ముస్లిం సమాజానికి మేలు చేయాలని ముస్లిం మైనారిటీ కమిటీ మండల అధ్యక్షుడు ఎండీ హమీద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మదీనా మసీద్ వద్ద వక్ఫ్ బోర్డు బిల్లుపై నిరసన వ్యక్తం చేశారు. బైక్ ర్యాలీతో తహసీల్ కార్యాలయానికి చేరుకొని వక్ఫ్ బోర్డు బిల్లును రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎండీ ఖాసీమ్, ఎండీ ఖాన్, హనీఫ్ ఖాసీమ్, ఇమామ్ గౌసుద్దీన్, మౌలానా అక్రమ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


నుజ్జునుజ్జయిన ఆటో

కోనరావుపేట: నిజామాబాద్ గ్రామ శివారులో ట్రాలీ ఆటో, టాటా ఏసీ ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం కోనరావుపేట నుంచి సిలిండర్ల ఆటో గ్రామాలకు వెళ్తోంది. కొలనూర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు టాటా ఏసీ వాహనంలో కోనరావుపేటకు వెళ్తున్నారు. నిజామాబాద్ ఎల్లమ్మ గుడి శివారులో రెండు వాహనాలు ఢీకొట్టుకోగా.. కోనరావుపేటకు చెందిన చెక్కపెల్లి శ్రీనివాస్ కాలు విరిగింది. పలుచోట్ల గాయాలయ్యాయి. కొలనూర్‌కు చెందిన మాసం సుదర్శన్, శిల్ప, లాస్యకు గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసుల ఆరా

చందుర్తి: మండల కేంద్రంలో జరిగిన దొంగతనంపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. బుధవారం అర్ధరాత్రి రెండిళ్లలో చొరబడి నగదు ఎత్తుకెళ్లగా.. మూడో ఇంట్లో ఎత్తుకెళ్లిన పల్సర్ బైక్ ఇదే మర్రిగడ్డ గ్రామ శివారులోని ఓ ఒర్రెలో వదిలి పారిపోయారు. బైక్ స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలో ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించగా.. ఇద్దరు యువకులు 35 ఏళ్ల లోపు ఉన్నట్లు గుర్తించారు. దొంగతనం చేసి వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారైన చందుర్తిలోని ఓ సూపర్ మార్కెట్ సమీపంలో ఉన్న సమయంలో రోడ్డుపై నుంచి అంబులెన్స్ సౌండ్ వచ్చింది. పోలీసులని భావించి సూపర్ మార్కెట్‌కు ఎదురు వీధిలో నుంచి వెళ్లి ఇంటి ముందున్న పల్సర్ బైక్‌పై పరారయ్యారు. వెనక ఆటో రావడంతో.. వారు పోలీసులు కావచ్చని మర్రిగడ్డ గ్రామ శివారులో రోడ్డు పక్కనే ఉన్న ఒర్రెలో బైక్ వదిలి పారిపోయారని పోలీసులు భావిస్తున్నారు.

తల్వార్, కత్తితో డ్యాన్స్ చేసిన వ్యక్తి అరెస్ట్



ఇల్లంతకుంట: పెళ్లి వేడుకలో తల్వార్, కత్తితో డ్యాన్స్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ విధులను ఆటంకపరిచిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. జవారిపేట గ్రామానికి చెందిన గౌరవేణి శ్రీకాంత్ బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన ఓ వివాహ వేడుకలో పాల్గొని తల్వార్, కత్తితో విన్యాసం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడు. పోలీసులు వద్దని చెప్పినా వినలేదు. తన మహేంద్ర తార్ వాహనంలో తప్పించుకోగా.. శుక్రవారం తాళ్లపల్లి గ్రామం వద్ద పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి కత్తి, తల్వార్, తార్ మహేంద్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఎంఈవో, హెచ్‌ఎం తదితరులు

బోయినపల్లి: విలాసాగర్ హైస్కూల్ అభివృద్ధికి సహకరించాలని ఎంఈవో శ్రవణ్‌కుమార్, హైస్కూల్, పీఎస్ హెచ్‌ఎంలు బొలగం శ్రీనివాస్, మల్లేశం తదితరులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం సమర్పించారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి, మురుగుదొడ్లు, పైపులైన్ మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పీడీ ప్రభాకర్ తదితరులున్నారు.

భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారం

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంతో వివాదాస్పదంగా ఉన్న అన్ని భూముల సమస్యలు పరిష్కారమవుతాయని సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై శుక్రవారం వెంకటాపూర్‌లో సాంస్కృతిక సారథి కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు శ్రీరాముల రామచంద్రం, ఎడ్మల శ్రీధర్, గుగ్గిల్ల పర్శరాములు, వంతడుపుల గణేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్కారు నిర్ణయం కులవృత్తులకు ఉపయుక్తం

సిరిసిల్లటౌన్: కులవృత్తులకు కరెంటు సరఫరాలో రాష్ట్ర సర్కారు నిర్ణయం హర్షణీయమని అఖిల భారత విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు వేణుగోపాలాచారి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కంబోజు నవీన్‌కుమార్, విశ్వనాథుల కిషన్, ధూంపేట రవీందర్, మహేందర్, శ్రీనివాస్, రాజేశం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

ఇల్లంతకుంట: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు బండారి చందూగౌడ్ ఒక ప్రకటనలో కోరారు.